గుట్టలో వైభవంగా తిరు కల్యాణోత్సవం

లక్ష్మీనరసింహుల కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

- కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 20 : యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామిని గరుడ, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి సేవను కొనసాగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శ నారసింహ హోమం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా తిరు కల్యాణ తంతు జరిపించారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణ తంతు వీక్షించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులు సువర్ణ పుష్పార్చనలు చేశారు. బంగారు పుష్పాలతో దేవేరులను అర్చన చేశారు. సాయంత్రం వేళలో స్వామి వారికి దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళలో స్వామి వారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉదయం ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో అమ్మవారిని దివ్య మనోహరంగా ముస్తాబు చేసి వేద మంత్రాలు పఠిస్తూ తిరుప్పావై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. గోదాదేవి రంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పాతగుట్ట ఆలయంలో పాంచాహ్నిక దీక్షతో ఏకకుండాత్మక సుదర్శన నారసింహ మహా హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.18,49,662 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

ఉత్తర గోపురం ముందు గ్రిల్స్ ఏర్పాటు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి వేడుకలకు ఆలయ అధికారులు ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 23న స్వామి ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనం ఇవ్వనున్న నేపథ్యంలో ఉత్తర రాజగోపురం ముందు గల మాఢవీధుల చుట్టూ తాత్కాలిక స్టీల్ గ్రిల్స్ బిగిస్తున్నారు. ఈ ఏడాది వీవీఐపీ, వీఐపీతో, సాధారణ భక్తుల తాకిడి పెరుగనున్న నేపథ్యంలో వారికి ప్రత్యేకమైన క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. గుట్ట చరిత్రలో రెండోసారి స్వామి వారి ఉత్తర ద్వారం గుండా దర్శనం ఇవ్వనున్న సందర్భంగా భక్తుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం వాటిల్లకుండా స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లను చేస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలకు ప్రత్యేక లైన్లు, సాధారణ భక్తులకు ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేయనున్నారు.

గ్రిల్స్‌ను సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

- బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లవేళ లా అండగా ఉంటా
- రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం
- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- తిరుమలగిరిలో నియోజకవర్గ స్థాయి సమావేశం

తిరుమలగిరి, డిసెంబర్ 20 : రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజల మధ్యలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం తిరుమలగిరిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో కేసీఆర్ తనను తుంగతుర్తి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రటించారని తెలిపారు. ఇక్కడి నుంచి రెండు పర్యాయాలు గెలిచి కేసీఆర్ సర్కార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందించానని చెప్పారు. అలాగే వెనుకబడిన తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. నెర్రెలు బారిన నేలలకు జలసిరులు తీసుకొచ్చి పల్లెల్లో పచ్చని పంటలు పండేలా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని అన్నారు. గతంలో ఎన్నడూ జరుగని అభివృద్ధిని చేసినట్లు చెప్పారు. సమైక్య పాలనలో కక్షలు, కొట్లాటలతో ఉన్న ఈ ప్రాంతంలో ప్రగతి పరుగులు పెట్టించి ప్రశాంత వాతావరణం నెలకొల్పినట్లు గుర్తుచేశారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు..

కార్యకర్తలు అధైర్యపడొద్దని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సూచించారు. తాను ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్‌ను మరింతగా బలోపేతం చేద్దామన్నారు. ప్రజాతీర్పును గౌరవించి ఐదేండ్లపాటు ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషిస్తామని అన్నారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ అసత్య ప్రచారాలను తిప్పికొట్టడంలో బీఆర్ఎస్ శ్రేణులు విఫలం కావటం వల్లే ఓటమి చెందాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. అందరూ ఐక్యంగా ఉండి ఏకతాటిపై నడువాల్సిన అవసరం ఉందన్నారు. ఐదేండ్ల తరువాత రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ఇసుక మాఫియా

ఇసుకపై అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇసుక ద్వారా ప్రభుత్వానికి 5వేల కోట్ల వరకు ఆదాయం వచ్చినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలోనే ఇసుక మాఫియా జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుంటే ప్రజాక్షేత్రంలో నిలబెడుతామని హెచ్చరించారు. సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ రజాక్, మున్సిపల్ చైర్మన్లు, మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ గ్రామశాఖలు, అనుబంధ శాఖల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన నల్లగొండ జిల్లా జట్లతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ విజేత నల్లగొండ

మిర్యాలగూడ, డిసెంబర్ 20 : 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బాలురు, బాలికల విభాగంలో నల్లగొండ జిల్లా జట్లు విజేతగా నిలిచాయి. ఈ నెల 18 నుంచి మిర్యాలగూడలో జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు మాట్లాడుతూ గ్రూప్ ఈవెంట్స్‌లో బాలురు, బాలికల విభాగంలో నల్లగొండ జిల్లా జట్లు బంగారు పతకాలు, ఇండివిజువల్ ఈవెంట్స్‌లో వి.శశాంక్ బంగారు పతకం సాధించారన్నారు. జి.చందన, పి.వెంకటసాయి, వైష్ణవి జాతీయస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి.ప్ర శాంత్, ఎంబీఏ గౌరవ అధ్యక్షుడు జి.అంజయ్య, అధ్యక్షుడు నవీన్, జిల్లా కోచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీహర్ష

కోదాడ ఆర్టీసీ డిపోకు అవార్డు

కోదాడటౌన్, డిసెంబర్ 20: కోదాడ ఆర్టీసీ డిపోకు వెండి బహుమతి లభించింది. ఇంధన పొదుపు విభాగంలో కోదాడ డిపోకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం ఈ అవార్డును కోదాడ డీఎం శ్రీహర్షకు అందజేశారు. కోదాడ ఆర్టీసీ అధికారులు సుగుణాకర్, శివకుమారి, జీఎం రావు, రంజాన్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా..

- 11 మంది నుంచి రూ.18 లక్షలు వసూలు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 20 : ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూరు మండలం వర్టూరు గ్రామానికి చెందిన ఆలేటి నవీన్ ఖాలీగా ఉంటున్నాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానని భువనగిరి పట్టణంలోని సంజీవ్‌నగర్‌కు చెందిన మహిళ ద్వారా 11 మంది వద్ద రూ.18 లక్షలు వసూలు చేశాడు. వారికి పలు శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారుల పేరుతో నకిలీ పత్రాలు తయారు చేసి అందించాడు. అయితే అవి నకిలీవని తేలడంతో తమ డబ్బులు ఇవ్వాలని బాధితులు నిలదీశారు. అయినా వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో భువనగిరి పట్టణానికి చెందిన బాధితుడు ప్రవీణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలేటి నవీన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీకి అర్హులను ఎంపిక చేయాలి

- చండూరు ఆర్డీఓ దామోదర్‌రావు
- క్రిస్మస్ వేడుకపై తాసీల్దార్లతో సమీక్ష

చండూరు, డిసెంబర్ 20: కిస్మస్‌కు ప్రభుత్వం క్రైస్తవులకు అందించనున్న గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీ కోసం అర్హులను ఎంపిక చేయాలనిఆర్డీఓ దామోదర్ రావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో నియోజకవర్గ తాసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే దుస్తుల పంపిణీ, క్రిస్మస్ విందు ఏర్పాట్లు చేయాలన్నారు. క్రైస్తవ మత పెద్దల సమన్వయంతో నిరుపేదల లబ్ధిదారుల లిస్టును తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్లు రవీందర్ రెడ్డి, లావణ్య, బక్క శ్రీనివాస్, నరేందర్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు, తాసీల్దార్లు